కలలో మనిషి

శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య

గోడ గడియారం 'టంగ్' మని ఒక్కసారి మ్రోగి దీక్షగా పని చూసుకుంటున్న చంద్రమౌళి ఏకాగ్రతను భంగం చేసింది. ఆయన తలయెత్తి గడియారంవంక చూశాడు అయిదున్నర అయింది ఆఫీసులో మిగిలినవాళ్ళు కూడా వెళ్ళిపోయినట్టున్నారు. అంతా నిశ్శబ్దంగా ఉంది. ప్యూను రాఘవులు గుమ్మం ముందే కూర్చుని ఉన్నట్టున్నాడు అతని నీడ గాజు తలుపుమీద పడుతున్నది

చంద్రమౌళి తాను చూస్తున్న కాగితా లన్నింటిని ఎక్కడి వాటి నక్కడ సర్దివేసి పని ముగించుకుని నిట్టూర్చి, విశ్రాంతిగా రివాల్వింగ్ కుర్చీలో వెనక్కు వ్రాలి, ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు. ఇంతలోనే ఎన్నో దినాలుగా తనకు చిరపరిచితమైన 'టక్‌టక్' మనే ధ్వని వినిపించి ఆయన కళ్ళు తెరచి కిటికీలో నుంచి క్రిందికి చూసేసరికి మళ్ళీ ఆ కుర్రవాళ్ళిద్దరూ క్లబ్ కోర్టులో టెన్నిస్ ఆడుతూ కనిపించారు. ఆయన ప్రతి రోజూ వలెనే వారిని ఆసక్తితో గమనిస్తూ కూర్చున్నాడు.

ఆ ఆఫీసు పక్కనే ఒక క్లబ్బు ఉంది చంద్రమౌళి ఆఫీసు గదిలో నుంచి చూస్తే ఆ క్లబ్బు ప్రక్కభాగంలోని టెన్నిస్‌కోర్టు కనిపిస్తూ ఉంటుంది అసలా క్లబ్బులో టెన్నిస్ అంటే మోజు గాని, ఆసక్తి గాని ఉన్నవా రెవరూ లేరు. దాదాపు అందరూ అక్కడికి కేవలం పేకాట ఆడేందుకు వచ్చేవారే మూడు నెలల క్రిందట ఆ క్లబ్బుకు ఒక ప్రఖ్యాత రాజకీయ నాయకుడు రావడం జరిగింది ఆయనచేత అక్కడ ఏదో ఒక ప్రారంభోత్సవం చేయించుకుంటే ఆయనను బాగా గౌరవించిన ట్లవుతుందనీ, ఆ ప్రారంభించబడే విశేషమేదో ఆయన పేరుమీద చిరస్థాయిగా నిలబడి క్లబ్బుకు పేరు ప్రఖ్యాతులు తెస్తుందనీ ఎవరో సూచించారు అంతా ఆ ఆలోచన బాగున్నదనే అన్నారు కాని "దేనికి ప్రారంభోత్సవం చేయించాలి ?" అన్న మీమాంస వచ్చినప్పుడు ఎవరూ ఏమీ మాట్లాడలేదు. 'మన క్లబ్బులో ఏం తక్కువ ? పేకాటకు ఎంతమంది వస్తే అంతమందికి కావలసిన ఏర్పాట్లు యిప్పుడూ జరుగుతూనే ఉన్నాయి ఇప్పుడు మనకు లేని దేమిటి?" అని కమిటీ మెంబర్లందరూ దీర్ఘంగా ఆలోచించారు చివరకు ఇతర వూళ్ళలో రకరకాల క్లబ్బులను చూసిన ఒక మెంబరు "మన క్లబ్బులో లేని వేమిటో నేను చెబుతాను. ఎన్నాళ్ళనుంచో మీలో కొందరితో వ్యక్తిగతంగానూ, సమిష్టిగానూ కూడా యీ విషయం ప్రస్తావించాను. కాని మీ రెవ్వరూ దానిమీద ఆసక్తి చూపించనే లేదు ఇప్పుడు మన క్లబ్బులో ముఖ్యంగా లోపించినవి 'ఔట్‌డోర్ గమ్స్'. ఏ బాడ్మింటనో, టెన్నిసో, వాలీబాలో ఆడుకోవటం మన మెంబర్లలో చాలామందికి యిష్టంలేకపోవచ్చు రాత్రింబవళ్ళు పేకాట తప్ప మరేమీ వారికి రుచించకపోవచ్చు. కాని నామ మాత్రానికైనా అవి చాలా అవసరం ఇప్పుడు మన మెలాగూ ఈ రాజకీయ నాయకుణ్ణి పిలిచి సత్కరించి ఒక పార్టీ ఏర్పాటు చెయ్యాలనుకుంటున్నాం. ఒక టెన్నిస్ కోర్టు తయారుచేయించి ఆయనచేత ప్రారంభోత్సవం చేయిద్దాం. అది బాగుంటుంది" అన్నాడు. మిగిలినవా రందరూ దానికి తలలూపి "అవును. మీరు చెప్పింది బాగానే ఉంది" అన్నారు. వారిలో ఒకాయన సందేహిస్తూ "అవునండి. ప్లాను బాగానే ఉంది. కాని యిక్కడ మన కెవరికీ టెన్నిస్ కోర్టు పొడవు, వెడల్పులే సరిగా తెలియవుకదా ? ఇప్పు డెలా ?" అని అడిగాడు. మిగిలినవారు "అదీ నిజమే" అన్నారు. అప్పు డా మొదటి మెంబరు "అది అసలు సమస్యేకాదు మనకు ఆలోచన ఉండాలే కాని చిటికె వేస్తే పనులు జరుగుతాయి మా యింట్లో అద్దెకున్నవారి అబ్బాయి యూనివర్శిటీలో చదువు పూర్తిచేసుకుని ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ యిప్పుడు యిక్కడే ఉన్నాడు. అతని దగ్గర టెన్నిస్ బ్యాటు ఉంది. ఏమీ తోచక చాలా బాధపడిపోతున్నాడు నేను అతనితో మాట్లాడుతాను. ఆ బాధ్యత అంతా నామీద ఉంచండి" అన్నాడు. అంతా "సరే" నన్నారు తర్వాత త్వరత్వరగా పనులు జరిగిపోయాయి ఆ రాజకీయ నాయకుడు వచ్చే వేళకు టెన్నిస్ బాగా ఆడగలిగిన వారి నిద్దరిని సమకూర్చగలిగారు ఈ విధంగా ప్రారంభమైన ఆ టెన్నిస్‌కోర్టు తర్వాత తర్వాత చాలా నిర్లక్ష్యంపాలైంది నిజానికి అక్కడివా రెవరికీ, పేకాటకు ఉపయోగించవలసిన అమూల్యమైన తమ కాలాన్ని యీ క్రొత్త ఆటకోసం వ్యర్థం చెయ్యటం యిష్టంలేదు. అందువల్ల ప్రారంభోత్సవంనాడు ఏ యిద్దరు యువకులు ఆడారో చివరకు వా రిద్దరే మిగిలారు సాయంకాలం అయిదున్నర అయ్యేసరికి క్రిందినుంచి 'టక్ టక్' మని ఆ ధ్వని వినరావటమూ, చంద్రమౌళి కొద్దిసేపు వారి ఆటను గమనించటమూ చాలా రోజులుగా జరుగుతున్నది.

టెన్నిస్ ఆడుతున్న యిద్దరిలోనూ ఒక వ్యక్తికి యిరవైనాలుగు సంవత్సరాల వయస్సు ఉంటుంది అతడు యూనివర్శిటీలో చదువు పూర్తి చేసుకుని ఉద్యోగప్రయత్నాలు చేస్తూ యింట్లో తల్లిదండ్రుల దగ్గరే ఉన్నాడు. బొద్దుగా ఆరోగ్యంగాఉండి ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా ఉంటాడు

రెండవవాడు చంద్రమౌళి ఆఫీసులోనే దాదాపు పదిహేను రోజుల క్రిందట ఉద్యోగంలో చేరాడు. అతడు అంతకుపూర్వం కూడా రోజూ సాయంకాలంవేళ టెన్నిస్ ఆడుతూ ఉండేవాడు చంద్రమౌళి టెన్నిస్‌కోర్టు ప్రారంభం అయిన నాటినుంచి అతన్ని జాగ్రత్తగా గమనించాడు అతనికి యిరవై యేళ్ళు ఉంటాయి సన్నగా, పచ్చగా ఉంటాడు అందమైన ముఖం జుట్టు పెడసరంగా ఉండి ఎప్పుడూ నుదుటిమీదికి పడుతూ ఉంటుంది. అతడు పెద్దగా నవ్వటం ఎవరూ చూసి ఉండరు చాలా గంభీరంగా ఉంటాడు ప్రతి పనినీ ఎడమచేతితో చేస్తాడు. అతడు టెన్నిస్ బాగా ఆడగలడు మెరుపువలె కోర్టంతా తానై విజృంభించి, ఎడమచేత్తో ఆడుతూ ప్రత్యర్థి కళ్ళు బైర్లు కమ్మించగల వేగం వుంది అతని దగ్గర

టెన్నిస్‌కోర్టు ప్రారంభోత్సవం జరిగిన తర్వాత దాదాపు నెల రోజుల పాటు ఆఫీసుటైము కాగానే యిలా క్రిందికి చూస్తూ వారి ఆటను గమనించటం చంద్రమౌళికి బాగా అలవాటైంది ఇంతలోనే తమ ఆఫీసులో మరో టైపిస్టు కావలసివచ్చి ప్రకటన చేయటమూ దానికి ఒక డజను అప్లికేషన్లు రావడమూ జరిగింది చంద్రమౌళి ఆ పన్నెండు మంది లోనూ యోగ్యులైనవారిని ఆరుగురిని ఎన్నుకుని వారికి 'యింటర్వ్యూ' కార్డులు పంపించాడు. ఒక ఆదివారంనాడు ఉదయం 'యింటర్వ్యూ' లు ప్రారంభమైనాయి ఒక్కొక్క అభ్యర్థితో దాదాపు యిరవై నిముషాలు మొదలుకొని అరగంట వరకు సంభాషించి మంచిచెడ్డలు తేల్చుకున్నాడు. వారిలో ఆరవవాడుగా చివరకు యీ ఎడమచేతి టెన్నిస్ ఆటగాడు లోపలికి వచ్చాడు. రాగానే చంద్రమౌళికి ఎదురుగా నిలబడి నమస్కారం చేశాడు. చంద్రమౌళికి రోజూ తాను చూస్తున్న యీ టెన్నిస్ ఆటగాణ్ణి

ఉద్యోగం కోసం వచ్చిన అభ్యర్థిగా చూడవలసి రావటం చిత్రంగా ఉంది. ఆయన అతనికి తన ఎదురుగుందున్న కుర్చీ చూపించి 'కూర్చోండి' అన్నాడు అతడు బిడియపడుతూనే కూర్చున్నాడు. చంద్రమౌళి అతని అప్లికేషను తీసి చూసి "మీపేరు పార్థసారథి కదూ ?" అని అడిగాడు. అతడు 'అవున' ని తల వూపాడు తర్వాత ఆయన అతని సర్టిఫికేట్లన్నీ చూశాడు 'టైపూ, షార్టుహ్యాండు" లలో అతని యోగ్యతను పరీక్షించాడు తాను మాట్లాడుతూ ఉంటే అతడు ముందు 'షార్ట్‌హ్యాండ్' లో వ్రాసుకోవలసిన అవసరం లేనివాడివలె టైపు మెషిను ముందు కూర్చుని, తాను చెబుతూవున్న దాన్ని వింటూనే టైపు చెయ్యటం ప్రారంభించాడు తాను వేగం ఎంత హెచ్చినా అత డెక్కడా తడుముకున్న జాడ అయినా కానరాలేదు అతని సన్నని వ్రేళ్ళు అద్భుతంగా, అతి వేగంగా 'టైపు మెషిను' మీద కదులుతూ ఉంటే చూడటం చాలా ఆసక్తి కలిగించింది తాను చెప్పడం ఆపిన తర్వాత అతడు 'మెషిను' లో నుంచి కాయితాలు తీసి ఆయన కిచ్చాడు చదివితే ఒక్క అక్షరం కూడా పొల్లుపోకుండా అంతా అలాగే ఉంది చంద్రమౌళి తన ఆశ్చర్యం పైకి కనుపించకుండా జాగ్రత్తపడి ఆ కాయితాలను బల్లమీద ఉంచి 'బాగానే ఉంది' అంటూ తల పంకించాడు . ఆయువకుడు చంద్రమౌళితో "మీరు అన్యథా భావించకపోతే ఒక్కవిషయం చెబుదా మనుకొంటున్నాను నేను చాలా బాధలలో ఉన్నాను. 'ఇంటర్మీడియేట్' ప్యాసయి రెండు సంవత్సరాలయింది. అప్పటినుంచి టైపూ, షార్టుహ్యాండూ నేర్చుకుంటూ ఎన్నో ఉద్యోగాలకు అప్లయిచేశాను కానీ, నాకే ఉద్యోగమూ దొరకలేదు. నే నందుకు బాధపడనూ లేదు బహుశా ఆ ఉద్యోగాలు నాకన్నా అర్హులైన వారికే లభించి ఉంటాయని నన్ను నేను సమాధాన పరచుకున్నాను కాని యిప్పుడు నా పరిస్థితులు మరింత విషమించాయి. నాకు ముసలి తల్లిదండ్రు లున్నారు. మా నాన్నగారికి కళ్ళుకనిపించవు అరవైయేళ్ళు వచ్చాయి మా అమ్మ జబ్బుమనిషి ఎన్నో ఏళ్ళనుంచీ దగ్గుతో బాధపడుతున్నది మనిషి చిక్కి శల్యమైపోయింది ఇన్నాళ్ళూ ఆసరాగా ఉన్న కొద్ది భూమినీ పదిరోజుల క్రిందటనే అమ్మి బాకీలు తీర్చాము ఇక ఇప్పుడు నాకు రెక్కలే ఆధారం నా సొద అంతా అనవసరంగా చెప్పుకుని మిమ్ములను బాధపెడుతున్నానేమో ! నా పరిస్థితిని కాస్తసానుభూతితో చూడండి" అన్నాడు. చంద్రమౌళి అతనివంక నిశ్చలంగా చూశాడు తర్వాత బల్లమీదికి వంగి "నే నేమీ అనుకోను మీ యోగ్యతలు చెప్పుకున్నారు మీ బాధలు చెప్పుకోవడమూ మంచిదే. అయినా మిమ్ములను నేను రోజూ ఎక్కడో చూస్తున్నాను" అంటూ ఏదో జ్ఞాపకం చేసుకుంటున్నట్టు నటించాడు. ఒక్క క్షణం ఆగి "అవును జ్ఞాపకం వచ్చింది. ఈ కిటికీలో నుంచి క్రిందికి చూడండి. ఈ ప్రక్కనే ఉన్న క్లబ్బు టెన్నిస్ కోర్టు యిక్కడికి కనిపిస్తూ ఉంటుంది రోజూ సాయంకాలంపూట మీరు టెన్నిస్ ఆడుతూ ఉండగా నేను చూస్తున్నాను టెన్నిస్ చాలా భాగ్యవంతుల వినోదం ఖర్చుతో కూడిన వ్యవహారం మీరేమో 'చాలా బీదవాళ్ల' మని చెబుతున్నారు నాకు చిత్రంగా ఉంది ...." అన్నాడు. ఆ యువకుడు నిట్టూర్చి "అవును అదీ నిజమే. కాని నేను ధనవంతుణ్ణయి వుండి విలాసంకోసం ఆడటంలేదు దాని కోసం నేను రాగి కానీ కూడా ఖర్చు చెయ్యటంలేదు నిత్యమూ ఇంట్లో జరుగుబాటే కష్టంగా ఉన్న నాకు ఆట పాటల కోసం డబ్బు ఖర్చు పెడదా మనేది కలలోనైనా ఊహించరాని విషయం ఆ టెన్నిస్ బ్యాటును నేను కొనలేదు 'అది నా దగ్గరి కెలా వచ్చింది ?' అనేది చాలా బాధాకరమైన ఒక కథ అది తలుచుకున్నప్పుడల్లా నాకు గుండెల్లో చేయివేసి కెలికినట్టుగా ఉంటుంది ఇప్పటికే కాలం వృధా చేస్తున్నానేమో నని నా కసలే బాధగా ఉంది ..." అంటూ ఆగిపోయాడు చంద్రమౌళి చేతి గడియారం చూసుకుని "ఫరవాలేదు మీరా విషయం కూడా చెప్పవచ్చు కావలసినంత వ్యవధి ఉన్నది నాకు" అన్నాడు. ఆ యువకుడు బాధ ధ్వనించే గొంతుకతో, "నేను రెండు సంవత్సరాల క్రిందటనే 'ఇంటర్మీడియేట్' ప్యాసయినాను. నేను చదువుకునే రోజులలో ఎవరితోనూ కలవకుండా ఒంటరిగా ఉండేవాణ్ణి. ఎవరితోనూ స్నేహం చేసుకోవాలనీ, కలిసి తిరగాలనీ ఉండేది కాదు. 'నా చదువే లోకంగా' నాపాటికి నేను కాలం గడుపుతూ ఉండేవాణ్ణి. నేను రెండో సంవత్సరం చదువుతూ ఉండగా ఒక కొత్త కుర్రవాడు మా క్లాసులో చేరాడు. అతని పేరు మధు చాలా చలాకీగా, హుషారుగా ఉండేవాడు. ఎక్కడో మొదటి సంవత్సరం చదివి వాళ్ళనాన్నగారికి ట్రాన్స్‌ఫర్ కావడంవల్ల వచ్చి రెండో సంవత్సరంలో చేరాడు వచ్చిన రెండు, మూడు రోజులలోనే అందరి పరిచయమూ పొంది నలుగురి అభిమానము సంపాదించుకొన్నాడు అతడు నన్ను మాట్లాడించి నాతో స్నేహం చేసుకోవాలని చూశాడు. కాని నేను బెరుకు బెరుగ్గా మాట్లాడటంతో నా తత్వం అతడు వెంటనే కనిపెట్టి మరీచనువుగా స్నేహంగా ప్రవర్తించటం ప్రారంభించాడు అలా ఒక వారంరోజుల స్నేహంతోనే నన్ను పూర్తిగా మార్చివేశాడు అతని నవ్వు అంత అద్భుతమైనది అతని మాట అంత శక్తి కలది. అతడు 'తన నవ్వుతో ప్రపంచాన్నంతటినీ జయించగలడ'నిపించేది. తర్వాత మా స్నేహం బాగా పెరిగింది "ఒకరిని చూడకుండా మరొకరం ఉండలేమన్నంత" దూరం వచ్చింది అతనికి టెన్నిస్ అంటే చాలా అభిమానం సాయంకాలం అయ్యేసరికి పొట్ట లాగూ, బనియనూ వేసుకొని టెన్నిస్ బ్యాటు చేత్తో వూపుకుంటూ వచ్చేవాడు నన్ను కూడా తనవెంట రమ్మని గొడవ చేసేవాడు. అతడు ఆడుతూఉంటే చూసేందుకు ఎంతో అద్భుతంగా ఉండేది. అంత వేగంగా, అంత నేర్పుగా టెన్నిస్ ఆడేవా రెవరినీ నేను చూడలేదు అతడు నన్ను కూడా ఆడమని ప్రోత్సహించేవాడు తనతో ఆడేవారు మరెవరూ లేని సమయంలో నాకు దాన్ని బోధపరిచేవాడు తర్వాత తర్వాత నాకు తన బ్యాటు యిచ్చి నేను ఆడుతూ ఉండగా చూస్తూ నుంచునేవాడు తనకేదైనా పనివున్న రోజులలో తన బ్యాటు నాకు యిచ్చి నన్ను 'ఆడుతూ ఉండమని' చెప్పి వెళ్లేవాడు ఈ విధంగా రెండు మూడు నెలలు గడిచేసరికి నాకు ఆట బాగా వచ్చింది నేను ఎడమచేతితో ఆడటం అతని కెంతో ముచ్చటగా ఉండేది. నాతో ఆడుతూ తాను కావాలని ఓడిపోతూ, ఆ ఓటమిలోనే ఆనందిస్తూ ఉండేవాడు తర్వాత పెద్ద పరీక్షలు దగ్గరికి రావటంవల్ల నేను నా దృష్టి నంతటినీ చదువుమీదనే కేంద్రీకరించాను అతడు కూడా కష్టపడి చదువుతూ ఉండేవాడు సాయంకాలంపూట టెన్నిస్ మాత్రం మానేవాడు కాదు పరీక్షలైపోయి ఫలితాలు తెలిశాయి. నేను అన్ని సబ్జక్టులలోనూ ప్యాసైనాను మధు గ్రూపులో తప్పాడు ఫలితాలు తెలిసిననాటి సాయంకాలం టెన్నిస్ బ్యాటు తీసుకుని నా దగ్గరికి వచ్చాడు ఇద్దరం నా గదిలో చాపమీద కూర్చున్నాము నాకేం మాట్లాడాలో తెలియలేదు. అతడు ఒక్క క్షణం ఆగి గాద్గదికంగా "ఈ బ్యాటు నువ్వు తీసుకో సారథీ ! నేను మళ్లీ పరీక్షలకు వెళ్లి గ్రూపులో ప్యాసయ్యే వరకూ టెన్నిస్‌కోర్టులో దిగను" అన్నాడు. నాకు ఆశ్చర్యం వేసింది తర్వాత అతడే నెమ్మదిగా అన్ని విషయాలూ చెప్పాడు ఇంట్లో వాళ్ల నాన్నగారు పరీక్షా ఫలితాలు చూడగానే చాలా గొడవ చేశారుట 'ఆటలలో పడి చదువు నాశనం చేసుకున్నావ' ని చాలా నిష్ఠూరంగానూ, కఠినంగానూ మాట్లాడారుట "ఆత్మాభిమానం లేశమైనా ఉంటే ఆట కట్టిపెట్టి యీసారి అయినా జాగ్రత్తగా చదివి ప్యాసయినా వనిపించుకో" అన్నారుట మధు కాస్సేపు కూర్చుని తర్వాత వెళ్లిపోయే సమయంలో "నేను మళ్లీ కాలేజీలో చేరబోవడంలేదు టైపు నేర్చుకుంటూ, ఏదైనా ఉద్యోగం చూసుకుందా మనుకుంటున్నాను నువ్వు ఎప్పుడైనా సరే నా దగ్గరికి రావచ్చు" అని చెప్పాను "అలాగే" అని తలవూపి వెళ్లిపోయాడు కాని ఆ తర్వాత అతడు నాకు చాలా అరుదుగా మాత్రమే కనుపించేవాడు నేను రోజూ టెన్నిస్ ఆడుతూ ఉండేవాణ్ణి. ఆ ఆటలో బాగా నైపుణ్యం సంపాదించి ఆ వూళ్లో క్లబ్బు నిర్వహించిన పోటీలలో నెగ్గాను కూడా ఆ పోటీలు జరిగేటప్పుడు మాత్రం మధు వచ్చి నన్ను ప్రోత్సహిస్తూ ఉండేవాడు. బహుమతి తీసుకుని యివతలికి రాగానే నన్ను కౌగలించుకుని "నువ్వు పెద్ద ఛాంపియన్‌వోయ్ ! పరీక్షలైపోగానే నేను మరోబ్యాటు కొంటాను మనిద్దరం ఆడాలి" అంటూ నన్ను అభినందించాడు. తర్వాత రెండు, మూడు సార్లు మాత్రమే నేను అతన్ని కలుసుకో గలిగాను. అతడు రాత్రింబవళ్లు చదవటం ప్రారం

ఖించాడు. ఆ చదువు అతన్ని పీల్చి పిప్పిచేసింది బాగా చిక్కిపోయాడు.. కాని ఆ చిరునవ్వు మాత్రం అలాగే ఉండేది నేను తర్వాత ఉద్యోగ ప్రయత్నాలలో ఏవో వూళ్లకు వెళ్లవలసి రావడంవల్ల అతన్ని కలుసుకోలేకపోయాను నేను తిరిగి వచ్చేసరికి పరీక్షలైపోయాయి. టెన్నిస్ బ్యాటు తీసుకుని చివరి పరీక్ష రోజున సాయంకాలం వారి యింటికి వెళ్లాను పరీక్షలెలా వ్రాశాడో కనుక్కొని బ్యాటు యిచ్చి మళ్లీ కులాసాగా కలిసి కాలక్షేపం చేద్దామని వెళ్లాను నేను వెళ్లేసరికి యిల్లంతా బోసిగా దీనంగా ఉంది పంచలో ఏభై యేళ్ల వ్యక్తి ఒకాయన వాలు కుర్చీలో కూర్చుని ఉన్నాడు. నేను ఆయనను పిలిచి "ఏమండీ మధు ఉన్నాడా యింట్లో ?" అని అడిగాను ఆయన నన్ను 'గేటు దాటి లోపలికి రమ్మ'న్నాడు. వెళ్లగానే కుర్చీ చూపించి 'కూర్చోమన్నా'డు. నేను కూర్చుని "మధు .." అంటూ ఉండగా ఆయన దుఃఖం పొంగిపొరలిరాగా ముఖాన్ని చేతులలో కప్పుకున్నాడు. "ఏదో దారుణం జరిగిపోయుంద"నుకున్నాను. ఆయన కాస్సేపాగి కళ్లు తుడుచుకుని విషయమంతా చెప్పాడు నేను వింటూ రాతిబొమ్మ వలె కూర్చుండిపోయాను. నా చేతిలోని 'టెన్నిస్ బ్యాటు' చేతిలో ఉన్న పామువలె తోచింది దాన్ని క్రింద పడేశాను మధు పరీక్షలు రెండు రోజులలో ప్రారంభ మవుతాయనగా, ఒకనాడు చదువుకుంటున్న వాడల్లా లేచివచ్చి "నాన్నా ! నాకు గుండె నొప్పిగా ఉంది" అన్నాడట. ఆయన "యిక చదువు చాలించి పడుకో. ఏదైనా అతి పనికిరాదు" అన్నాడట. అతడు వెళ్లి పుస్తకం మూసివేసి పడుకున్నాడట. తెల్లవారి ఎంతకూ లేచిరాకపోయేసరికి వెళ్లి చూస్తే చలనంలేని కట్టె పడి ఉంది వెంటనే డాక్టరును తీసుకువచ్చారు కాని, "అంతా మించిపోయింది చేసేదేమీలేద"ని డాక్టరు వెళ్లిపోయాడు. ఆయన తర్వాత చేతులలో ముఖాన్ని దాచుకుని "నేనే నా బంగారు తండ్రిని చేతులారా చంపుకున్నాను" అంటూ దుఃఖించాడు నేను చాలా కష్టంమీద తేరుకోగలిగాను , తర్వాత ఆ బ్యాటు ఆయన ముందు ఉంచి, "దీన్ని మీ మధు తన పరీక్షలైపోయేదాకా నా దగ్గర ఉంచమని యిచ్చాడు 'పరీక్షలు కాగానే మళ్లీ యిద్దరం కలిసి ఆడుకుందామ'న్నాడు దీన్ని మీ దగ్గరే ఉంచండి" అన్నాను. ఆయన దాన్ని చూచేందుకైనా యిష్టపడక "ఒద్దు నాయనా ! దీన్ని నువ్వే ఉంచుకో వాణ్ని జ్ఞాపకం చేసే వస్తువును దేన్నీ నేను భరించలేను. నిరంతరం దాన్ని చూస్తూ ప్రేగులు తోడివేసే యీ దుఃఖాన్ని భరించలేను దీన్ని తీసుకుపో" అన్నాడు. నేను చేసేదేమీ లేక దాన్ని చేతుల్లోకి తీసుకుని వచ్చేసాను" అని చెప్పి ఆగాడు చంద్రమౌళి అంతా విని కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా కూర్చుని "సరే ఏ విషయమూ నేను తర్వాత తెలియజేశాను మీరిక వెళ్లవచ్చు" అన్నాడు ఆ యువకుడు లేచి చంద్రమౌళికి నమస్కరించి వెళ్లిపోయాడు తర్వాత ఆ ఆరుగురు అభ్యర్థులలోను పార్థసారథి తనకు యోగ్యుడుగా కనిపించినందువల్ల అతనికే 'అపాయింట్‌మెంట్ ఆర్డరు' పంపించాడు పార్థసారథి వెంటనే ఉద్యోగంలో చేరి, అప్పటి నుంచీ చాలా శ్రద్ధగా పనిచేస్తూ చంద్రమౌళి అభిమానాన్ని యిట్టే సంపాదించాడు.

చంద్రమౌళి కిటికీలోనుంచి క్రిందికి చూస్తున్నవాడల్లా 'బాబుగారూ' అనే పిలుపు వినిపించి వెనుదిరిగి చూశాడు ప్యూను రాఘవులు నిలబడివుండి "నాపని అంతా అయిపోయింది బాబుగారూ ! డ్రైవరు కారు తీసుకుని వచ్చి వాకిట్లో కూర్చుని ఉన్నాడు మీ రిప్పుడు బయలుదేరరా ?" అని అడిగాడు చంద్రమౌళి లేచి ఒక్క క్షణంసేపు నుంచుని, తర్వాత రాఘవులు అందించిన తాళాలు అందుకుని యివతలికి వచ్చాడు ఆయన కూర్చుని తలుపు వేసుకోగానే కారు వేగం అందుకుని పరుగెత్తడం ప్రారంభించింది.

* * * *

చంద్రమౌళి మొహమూ కాళ్లూ చేతులూ కడుక్కొని వాలు కుర్చీలో కూర్చుని దినపత్రిక చేతిలోకి తీసుకుంటూ ఉండగా ఒక చేతిలో కాఫీ కప్పుతో, మరొక చేతిలో ఒక పోస్టు కవరుతో అక్కడికి వచ్చింది శ్రీదేవి. చంద్రమౌళి కవరు విప్పకుండా దాన్ని బల్లమీద అలాగే ఉంచి కాఫీ కప్పు అందుకున్నాడు. శ్రీదేవి ఆయన కెదురుగా స్టూలుమీద కూర్చున్నది. ఆమెకు ముప్ఫయి రెండేళ్ల వయస్సుంటుంది చాలా అందమైన మనిషి ఆమె కాపురానికి వచ్చినప్పటినుంచి చంద్రమౌళి ఆ ఆనంద సముద్రంలో మునకలు వేస్తూ తన వెనుకటి జీవితాన్నీ, వెనుకటి విషయాలనూ మరిచేపోయాడు.

శ్రీదేవి, భర్త కాఫీ త్రాగుతున్నంతసేపూ నిశ్శబ్దంగా కూర్చుని తర్వాత ఖాళీ కప్పు అందుకుంటూ 'మన మురళి ఉత్తరం వ్రాశాడు, చూడండి' అన్నది. చంద్రమౌళి అప్పుడు కొడుకు వ్రాసిన ఉత్తరాన్ని చదువుకుని "ఏమున్నదీ ? ఎప్పుడూ వ్రాసే సంగతులేగా ? హాస్టల్లో తిండి సరిగా లేదనీ, ఆ క్రమశిక్షణ తనకు చాలా బాధాకరంగా ఉందనీ, ఇష్టం వచ్చినట్టు వూరిమీద పడి తిరగనివ్వరనీ, గోల చేసేందుకు వీలులేదనీ యివి ఎప్పుడూ ఉన్న ఆరోపణలేగా ! అయినా అటువంటి కట్టుబాట్లకు లోబడి చదువుకోవటంలో ఉన్న లాభం యిప్పుడు తెలియదు వాడలా వ్రాస్తున్నాడని నువ్వు దిగులుపడకు చదువుకునే రోజులలో అలా గట్టి కట్టుబాట్లలో ఉండటం మంచిదే" అన్నాడు

ఆమె నిట్టూర్చి "ఏమో ! ఆరు నెలలయింది పిచ్చి తండ్రిని చూసి" అన్నది చంద్రమౌళి "మరొక రెండు నెల లాగితే ఎలాగూ వాడి పరీక్షలైపోయి యిక్కడికి రానే వస్తాడు ఇంతలోనే ఆరాటం ఎందుకూ ? . ఒక్క సంవత్సరం తల్లిదండ్రులనూ, వున్నవారినీ వొదిలి, చక్కని క్రమశిక్షణ క్రింద ఒక కాలేజీ హాస్టల్లో ఉండటం వాడికి అంత బాధగా ఉంది. నా విషయం చూడు నాకు వూహ తెలియకముందే నా తల్లిదండ్రులు చచ్చిపోయారు వారాలు చేసుకుని, వారినీ వీరినీ ప్రార్థించి చందాలు పోగుచేసి జీతాలు కట్టి చదువుకున్నాను ఒక యిల్లనీ వాకిలి అనీ లేకుండా ఒక్కొక్కప్పుడు వీధి లాంతరు క్రింద కూర్చుని చదువుకున్నాను ...." అంటూ ఆలోచనలో పడిపోయాడు.

శ్రీదేవి మరేమీ మాట్లాడలేదు మరొక నిముషంసేపు అలాగే కూర్చుని తర్వాత లేచి "నేను పేరంటానికి వెళ్లి వస్తాను కాస్త పొద్దుపోతుందేమో ? మీరు ఇంట్లోనే ఉంటారా ? ఎక్కడికైనా వెళ్లదలుచుకున్నారా ?" అని అడిగింది ఆయన తల వూపి "ఎక్కడికీ వెళ్లను" అన్నాడు. "అయితే నేను సిద్ధమై వస్తాను ఒక్కసారి కిందికి వచ్చి, తలుపు వేసుకుని పైకి వొద్దురు గాని " అంటూ శ్రీదేవి క్రిందికి వెళ్లిపోయింది

తూర్పున పూర్ణచంద్రబింబం వెన్నెలలను వెదజల్లుతూ ఉదయించింది. తెల్లని శరత్కాలపు మేఘాలు దూది పింజలవలె ఆకాశంలో అక్కడక్కడ కదులుతున్నాయి ఇంటి ఆవరణలోని కొబ్బరిచెట్ల ఆకులు వెన్నెల పూతతో వెండి కత్తులను ఒకదానిప్రక్కన మరొకటిగా పేర్చినట్టు ప్రకాశిస్తున్నాయి. పక్క డాబామీద పండు వెన్నెలలో యిద్దరు పిల్లలు పరుగులెత్తుతూ ఆడుకుంటున్నారు.

చంద్రమౌళి కొద్ది నిముషాలపాటు దినపత్రికలో విశేషాలు చూసి తర్వాత తల ఎత్తగానే ఆకాశంలో ఆయనను ముగ్ధుణ్ని చేసే అపురూపమైన దృశ్యం కనుపించింది పెద్ద ప్రమిద ఆకారంలో ఉన్న పలుచని మబ్బు ముందు ఉజ్జ్వలంగా కాంతు లీనుతున్న ఖరీదైన మంచి ముత్యం వలె ఉన్నది చంద్రబింబం పక్క డాబామీద ఆడుకుంటున్న యిద్దరు పిల్లలలో మగపిల్లవాడు "మల్లికా ఆ మబ్బు చూడవే దీపపు ప్రదిమలా లేదూ ?" అంటున్నాడు.

చంద్రమౌళి ఆలోచనలో పడ్డాడు. ఆయన నలభై అయిదేళ్ల జీవితంలోనూ ఎన్నడూ గతాన్ని నెమరు వేసుకోవలసిన అవసరం కాని, సందర్భంకాని, లేకపోయింది పుట్టగానే తల్లినీ, తండ్రినీ దూరం చేసుకుని ఎవరో బీద దూరపు బంధువులు దగ్గరికి తీసి పెంచగా బాల్యం గడిపాడు. తర్వాత ఫస్టుఫారం నుంచీ బి ఏ వరకూ వారాలు చేసుకుంటూ కాలం గడిపాడు, అదృష్టం బాగుండటం వల్లనూ, నోరు మంచిది కావడం వల్లనూ మంచి ఉద్యోగమే దొరికింది. వారూ వీరూ సంకల్పించి వివాహం చెయ్యగా నిక్షేపంగా మారు మాటాడకుండా బుద్ధిగా పెళ్లి చేసుకున్నాడు. అత్యంత అనుకూలవతి అయిన భార్యతో, చదువుకుంటూ పైకి

వస్తున్న కొడుకుతో, జీవితం ఆయనకు చక్కని సిమెంటు రోడ్డుమీద కారు ప్రయాణంవలె అన్ని విధాలా హాయిగా ఉన్నది వివాహమైన తర్వాత ఎన్నడూ ఆయన తన పూర్వజీవితాన్ని గురించి ఆలోచించనే లేదు ఎవరైనా బీద పిల్లలు ఏదైనా సహాయం కావాలని వస్తే వారిని ఎక్కువగా మాట్లాడించకుండా చేతనైన సహాయం చేసి వెంటనే పంపివేసేవాడు

ఇప్పుడు తీరికగా కూర్చుని ఆకాశంలో ప్రమిద ఆకారంలో ఉన్న మబ్బును చూస్తూవుండగా, పక్క డాబామీద వెన్నెలలో యిద్దరు పిల్లలూ పరుగులెత్తుతూ ఆడకుంటూ ఉండగా, ఆయనకు ఎన్నడో జరిగిన విషయాలు జ్ఞాపకం రావడం ప్రారంభించాయి తానూ యిలాగే శుభ్రజ్యోత్స్న ప్రపంచాన్ని ఆహ్లాదంలో ముంచెత్తుతూ ఉండగా ఆటలాడుకున్నాడు ఇలాగే వింతవింత ఆకారాలలో ఉన్న మబ్బులను మరొకరికి చూపిస్తూ "ఆ మబ్బు మొసలిలా లేదూ ? ఈ మబ్బు గిన్నెలా లేదూ ? అక్కడ ఆ మబ్బు మొగలి పొదలా లేదూ ?" అంటూ ఉండేవాడు. తన పక్కన అప్పుడు తన మాటలు వింటూ పన్నెండేళ్ల పిల్ల ఉండేది అవును పన్నెండేళ్ల బంగారు బొమ్మ .... సృష్టికర్త తన సర్వశక్తులనూ వినియోగించి ఎంతో దీక్షతో, విశ్వల బుద్ధితో మలచిన పుత్తడి బొమ్మ . . ఆ పిల్ల నవ్వుతూ ఉంటే ముత్యాలూ రత్నాలూ జలజల రాలుతున్నట్టుండేది

చంద్రమౌళి భార్య పిలుపు విని వెనక్కు తిరిగి చూశాడు శ్రీదేవి మెట్ల దగ్గర నిలబడి ఉండి "మీరు క్రిందికి వచ్చి తలుపు వేసుకోండి. నేను వెడుతున్నాను" అన్నది ఆమె కనకాంబరం రంగు సిల్కు చీర కట్టుకుని పేరంటానికి పోయేందుకు సిద్ధమై ఉన్నది. ఆయనే లేచి క్రిందికి వెళ్లి ఆమె కారులో ఎక్కి వెళ్లిపోగానే, తలుపు గడియ వేసుకుని మళ్లీ పైకి వచ్చి వాలు కుర్చీలో కూర్చున్నాడు ఆకాశం యిప్పుడు నిర్మేఘంగా ఉన్నది. ప్రక్క డాబామీద యింతవరకూ ఆడుకుంటున్న పిల్ల లిద్దరూ క్రిందికి వెళ్లిపోయారు కాబోలు—చుట్టుప్రక్కల అంతా నిశ్శబ్దంగా ఉన్నది

చంద్రమౌళి మళ్లీ ఆ విషయాన్నే మననం చేసుకోవడం ప్రారంభించాడు ఆయన అప్పటికి పధ్నాలుగేళ్లవాడు. పట్నంలో ఉండి వారాలు చేసుకుని చదువుకుంటూ ఒకసారి వేసవి సెలవులలో తన బీద బంధువుల వూరికి వెళ్లాడు అది ఒక చిన్న పల్లెటూరు ఆ వూరి చుట్టూ బంగారం పండే సారవంతమైన భూము లుండేవి ఊరికి కొద్ది దూరంలో నది ఉండేది. నది ఒడ్డునే ఒక పాడుబడిన ప్రాచీన కట్టడం ఉండేది దాని చుట్టూ ఒక పెద్ద కొబ్బరితోట చంద్రమౌళి కా వూళ్లో ఏమీ తోచేదికాదు ఇంత నిశ్శబ్దంగా 'మనుష్యు లెలా జీవించగలరా ?' అనిపించేది ఆ వూళ్లో పగలే ఏమీ సందడి ఉండేది కాదు. పైగా తన యీడువా రందరూ తమ పనులమీద తాము ఉండేవారు ఒకవేళ ఎవరైనా తనను కలుసుకోవటం తటస్థించినా వారి అభిరుచులూ, తన అభిరుచులూ వేరుగా ఉండేవి వారు మాట్లాడే విషయాలు తనకు మొరటుగా ఉండేవి తాను మాట్లాడితే వారికి వింతగా ఉండేది అందువల్ల ఎవరి ప్రమేయమూ పెట్టుకోకుండా అతడు వూరికి దూరంగా నడిచి వెళ్లి నదిఒడ్డున ఉన్న మండపం దగ్గర ఏదో చదువుకుంటూ కూర్చునేవాడు ఒకనా డతడు అక్కడ స్తంభాని కానుకుని కూర్చుని ఉండగా ఆ అమ్మాయి అటువైపు వచ్చింది ఆమె వెంట అయిదేళ్ల పిల్లవా డొకడు చేతిలో కొయ్యబొమ్మతో నడిచి వచ్చాడు వాళ్లిద్దరూ అక్కడ మరొక వైపున కూర్చుని ఆడుకోవటం ప్రారంభించారు చంద్రమౌళి ఆ పిల్లను ఉద్దేశించి 'మీ యిల్లెక్కడ ?' అని ప్రశ్నించాడు ఆ పిల్ల వెనుదిరిగి తన విశాల నయనాలను మరింత పెద్దవిగా చేసి అతనివంక చూసింది తర్వాత వూరివైపు చూపిస్తూ 'అక్కడ' అని చెప్పింది చంద్రమౌళి మళ్లీ "వీడు మీ తమ్ముడా ?" అని అడిగాడు ఆ పిల్ల 'అవున'న్నట్టు తల వూపింది. అతడు ఒక్క క్షణం ఆగి మళ్లీ 'నీపే రేమిటి ?' అని అడిగాడు 'ఉషాబాల' అని సమాధానం చెప్పిందా పిల్ల

గాలి మంద మందంగా హాయిగా వీస్తున్నది సూర్యుడు తన ప్రతాపం చాలించి పడమటి దిక్కున అస్తమిస్తున్నాడు. ఆకాశం రంగులంగుల మబ్బులతో నిండి చిత్రలేఖనంలో ప్రాథమిక సూత్రాలైనా తెలియని పసివాడు తన చిత్తం వచ్చినట్టు రంగులు పూసి వ్రాసిన చిత్తరువు వలె ఉన్నది. కొద్ది నిముషాలలోనే సూర్యాస్తమయం అయి, దేవకన్యలు తమలో తాము ఆడుకుంటూ విసిరిన బంగారు బంతివలె చంద్రబింబం ఉదయించింది

ఉషాబాల ఆట చాలించి తమ్ముణ్ణి వెంటబెట్టుకుని బయలుదేరింది. చంద్రమౌళి కూడా వెంట నడిచాడు. నడుస్తూ ఎన్నో విషయాలు కనుక్కున్నాడు. ఆ పిల్ల తల్లి అయిదేళ్ల క్రిందట చనిపోయింది. భార్య పోయి సంవత్సరం తిరగ్గానే ఆ పిల్ల తండ్రి మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. వెంటనే భార్యను కాపురానికి కూడా తీసుకుని వచ్చారు మొదట్లో సవతి తల్లి యీ పిల్లను బాగానే చూసేది కాని కాలం గడిచేకొద్దీ ఆమెలో మార్పు వచ్చింది. ఆమెలో కోపమూ, అసహనమూ ఎక్కువయి ఆ పిల్లను కొద్దిగా బాధపెడుతూ ఉండేది. ఆ పిల్లకు శక్తికి మించిన పనులను చెప్పటమూ, సరిగా చెయ్యలేదని సాధిస్తూ ఉండటమూ సాగించింది. ఏ పని అయినా చెప్పేదాకా చెయ్యకపోతే "నేను చెబితేగాని చెయ్యవన్నమాట" అనేది. చెప్పకుండా చేసుకుపోతే "నేను చెప్పనిదే ఎందుకు చేశావు ?" అని సాధించేది. తర్వాత ఆమెకు కూడా ఒక మగపిల్లవాడు పుట్టాడు అప్పటినుంచి ఆమె ఆ పిల్లను కొంచెం ప్రేమగానే చూడటం ప్రారంభించింది అయినా సాధింపూ, కోపమూ, అసహనమూ మాత్రం పూర్తిగా పోలేదు. ఆ పిల్ల చాలా దీనంగా ఉండేది ఎప్పుడో చచ్చిపోయిన తల్లి తనకు గుర్తులేదు సవతి తల్లిలో మాతృప్రేమ కనిపించటంలేదు తండ్రి తనవిషయం అసలు పట్టించుకోడు అంతా విన్నతర్వాత చంద్రమౌళి గుండె ద్రవించింది. అతడు నిట్టూర్చి "నీకు నాన్న అయినా ఉన్నాడు నా సంగతి మరీ అన్యాయం. మా నాన్నా, అమ్మా నేను పుట్టిన రెండు మూడేళ్లలోనే పోయారు. వాళ్ల ముఖాలైనా నాకు గుర్తులేవు" అన్నాడు. ఈసారి జాలిపడటం ఆ పిల్లవంతు అయింది దీనంగా ఉన్న అతని ముఖాన్ని ఆమె చాలా ఆర్ద్రమైన దృక్కులతో చూసింది చంద్రమౌళి వారి యింటి వరకూ వెళ్లి వారిద్దరూ యింట్లోకి వెళ్లిన తర్వాత తన దారిన తాను వచ్చేశాడు

ఆ నాటినుంచీ వారిద్దరూ నది ఒడ్డున ఉన్న కొబ్బరితోటలో కలుసుకునేవారు పశ్చిమాద్రిన క్రుంగిపోతూ సూర్యబింబం తన కిరణజాలంతో లోకానికి బంగారుపూత వేస్తూ ఉండే సమయంలో వారిద్దరూ కొబ్బరి చెట్ల మధ్య పరుగులెత్తుతూ ఆడుకునేవారు దేవలోకంలోని అప్సర కన్యలు ఉపయోగించే నిర్మలమైన గుండ్రని అద్దం వంటి చంద్రబింబం తన చల్లని కిరణాలతో లోకానికి వెండిపూత వేసే సమయంలో మంటపంలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉండేవారు. జలతారు వస్త్రం మడతలలో దాచి ఉంచబడిన మంచి ముత్యం వలె పలుచని తెలి మబ్బులలో చంద్రుడు చిక్కుబడినప్పుడు వారిద్దరూ ఆటే చూస్తూ కూర్చుని "అదుగో చంద్రుడు మబ్బుల్లోకి పోయాడు ఇటు మళ్లీ యివతలికి వస్తున్నాడు మళ్లీ ఆ మబ్బు చంద్రుణ్ణి మింగేందుకు వస్తున్నది" అనుకుంటూ ఉండేవారు.

ఒకనాడు వారు ఒకరి వెంట ఒకరు పరుగులెత్తుతూ ఆడుకుంటూ ఉండగా ఆకాశం ఉన్నట్టుండి మేఘాలతో నిండిపోయింది అంతవరకూ నిరంకుశంగా ఆకాశ సామ్రాజ్యాన్ని పరిపాలించిన వేసవి బలహీనమై పోయింది. ఏ చిన్న మబ్బుతునక విప్లవం ప్రారంభించిందో తెలియదు ఉన్నట్టుండి చిన్న చిన్న మబ్బు లన్నీ కలిసి మహా శక్తిగా రూపొంది వేసవిని గద్దె దింపి తమ పరిపాలన ప్రారంభించాయి. ఆకాశం నల్లగా నిండు కుండవలె ఉన్నది. అంతవరకూ మిలమిలలాడిన నక్షత్రాలు మాయమైపోయాయి ఒక దిక్కున మేఘాలు తమ విజయచిహ్నంగా చేస్తున్న జయ ధ్వానాల వలె ఉరమటం కూడా ప్రారంభించాయి.

ఉషాబాల ఆకాశం వంక చూసి "అమ్మో ! వర్షం వొచ్చేట్టున్నది. మా పిన్ని 'వూరుకోదు నేను వెళ్లిపోతాను బాబూ ?" మెట్లు దిగటం ప్రారంభించింది చంద్రమౌళి, పదారు వన్నె పసిడి పాదాలు కనిపించేట్టు పరికిణీ కుచ్చెళ్లను పైకి పట్టుకుని త్వర త్వరగా క్రిందికి దిగిపోతున్న ఉష

బాలను చూస్తూ కూర్చున్నాడు అలా ఆ పిల్ల కొన్ని మెట్లు దిగేసరికే తన నెవరో తరుమ కుని వచ్చినట్టు వాన రానే వచ్చింది మళ్లీ ఆ పిల్ల త్వర త్వరగా పైకిరాక తప్పలేదు. ఆక్కడి నుంచి వానజల్లు వారి నిద్దరినీ మంటపం లోపలికి తరిమివేసింది. ముందు ఉషాబాలా, వెనక చంద్రమౌళీ వాన రొద వింటూ అలాగే నిలబడిపోయారు ఉషాబాల పండుతమలపాకుల వంటి తన చేతులలో పైనుంచి పడుతున్న వాన నీటిని పట్టుకుని ఒక్కసారిగా చంద్రమౌళి మొహాన చల్లింది చంద్రమౌళి మొహం తుడుచుకుంటూ 'ఊరుకో ఉషా ! మరీ అల్లరి వేషాలు వెయ్యకు నేను రేపు పొద్దున్నే వెళ్లిపోతువ్వాను'' అన్నాడు ఆ పిల్ల మళ్లీ నీళ్లు అతనిమీద చల్లబోతూ ఆగింది ఒక్క క్షణం పూరుకుని చేతిలోని నీటిని నేలమీద చల్లింది చేతులు పరికిణీకి తుడుచుకున్నది. తర్వాత కళ్లలో అమాయకత్వం పొలుకుతూ ఉండగా ''మళ్లీ రావా ?'' అని అడిగింది అతడు ''రాకేం ?' మళ్లీ సంవత్సరానికి . ఉషా ! నేను నీకు గుర్తుంటానా ?'' అని అడిగాడు ఆ పిల్ల ఏమీ మాట్లాడలేదు. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా కూర్చున్నది అతడే మళ్లీ ''నేను అక్కడికి వెళ్లి మళ్లీ వారాలు ఏర్పాటు చేసుకోవాలి ఈ సెలవులలో ఎవరున్నారో .... ఎవరూ వూరు వదలి పోయారో పోయిన సంవత్సరం నేను ప్రతి శుక్రవారం జిల్లా జడ్జీగారి యింట్లో భోజనం చేసేవాణ్ణి . ఈ చొక్కా, లాగూ యిచ్చింది కూడా ఆయనే అప్పటికే బదిలీ అవుతుందనే అనుకునేవారు. ఇప్పు డున్నారో లేరో'' అన్నాడు ఉషాబాల ఏమీ మాట్లాడలేదు చంద్రమౌళి కూడా తర్వాత ఏమీ మాట్లాడకుండా మౌనంగా కూర్చున్నాడు. వాన అలా కొంతసేపు, కుండపోతగా కురిసి తర్వాత కొద్దిగా తగ్గింది చంద్రమౌళి చేయి బయటికి చాపి చూసి ''వాన తగ్గింది యిక పోదాం పద'' అన్నాడు మెట్లు దిగుతూ ఉషాబాల అతన్ని అనుసరించింది ఇద్దరూ వూళ్లోకి వచ్చారు ఉషాబాల యింటిముందాగి చంద్రమౌళి ''రేపు ప్రొద్దున్నే వెళ్లిపోతాను నేను మళ్లీ కనిపిస్తావా ?'' అని అడిగాడు ఆ పిల్ల తల వూపి లోపలికి పోతూ ఒకసారి తన లేడి కళ్లను అతనివైపు తిప్పి చూసింది. తర్వాత యింట్లోకి వెళ్లిపోయింది చంద్రమౌళి నెమ్మదిగా నడిచి తన యింటికి వచ్చాడు

అతడా మర్నాడు బండ్లో ఎక్కి స్టేషనుకు వచ్చాడు ఉషాబాల అతనికి మళ్లీ కనిపించనే లేదు మళ్లీ సెలవులకు అతడా వూరికి వెళ్లేసరికి వారా వూళ్లో లేరు

చంద్రమౌళి గాఢంగా నిట్టూర్చాడు 'తర్వాత ఆమె ఏమయింది ? ఎలా బ్రతికింది ?'' అనే ప్రశ్నలకు సమాధానమే లేదు ఇదంతా తన మనస్సులో ఎక్కడో అట్టడుగున పడిపోయిన విషయం తన చదువూ, ఉద్యోగమూ, ప్రమోషన్లూ, పెళ్లీ, అత్యంత సంతృప్తికరమైన వైవాహిక జీవితమూ, వీటి అడుగున ఎక్కడో పడి యున్నాళ్లకు యీ పిల్లల ఆట చూస్తూవుండగా యిది బయటికి వచ్చింది

ఆ తర్వాత ఆయన కొన్ని నిముషాలపాటు అలా నిశ్శబ్దంగా కూర్చున్నాడో లేదో క్రిందినుంచి శ్రీదేవి పిలుపు వినవచ్చింది ఆయన వెంటనే క్రిందికి దిగి వచ్చేశాడు.

* * * *

ఉదయం చంద్రమౌళి ఆఫీసుకు వెళ్లి తన కుర్చీలో కూర్చోగానే రాఘవులు ఒక కాయితం తెచ్చి యిచ్చాడు 'పార్థసారధిగారు యిమ్మని చెప్పారండీ' అన్నాడు.

పార్థసారధి 'తన తల్లికి అకస్మాత్తుగా ప్రాణంమీదికి వచ్చింద' నీ, 'అర్ధరాత్రివేళ ఆసుపత్రికి తీసుకు వెళ్లవలసి వచ్చిందనీ, రెండు గంటలు ఆలస్యంగా ఆఫీసుకు వచ్చి అన్ని విషయాలూ మాట్లాడగలననీ', వ్రాశాడు చంద్రమౌళి ఆ కాయితాన్ని ప్రక్కనే ఉంచుతూ రాఘవులతో ''సరే నువ్వు వెళ్లవచ్చు'' అన్నాడు.

తర్వాత ఆయన తన పనిలో లీనమైపోయాడు పన్నెండు గంటల వేళ రాఘవులు కాఫీ తెచ్చి యిచ్చాడు చంద్రమౌళి విశ్రాంతిగా కూర్చుని కాఫీ త్రాగుతూ ఉండగా పార్థసారథి లోపలికి వచ్చాడు అతని ముఖం చిన్నబోయి ఉంది

చంద్రమౌళి ''కూర్చోండి మీ కాగితం చూశాను ఎలా ఉన్నది మీ అమ్మగారికి ?'' అని అడిగాడు పార్థసారధి దీనంగా ''ఎలా ఉన్నదని చెప్పను ? డాక్టరు ఏ విషయమూ రెండు రోజులు గడిస్తేగాని చెప్పలేనంటున్నాడు రాత్రి ఉన్నట్టుండి దగ్గు ఎక్కువై అపస్మారక స్థితి వచ్చింది. పలకడం మానివేసింది మన స్పృహ లేదు మేము అప్పటి కప్పుడే ఆసుపత్రికి తీసుకుపోయాము డాక్టరు పరీక్షచేసి ఏవో యింజెక్షనులు యిచ్చాడు. కాని యింతవరకూ మన లోకంలోకి రాలేదు అలాగే చలనం లేకుండా పడి ఉన్నది మా నాన్నను చూస్తూఉంటే నా కడుపు తరుక్కు పోతున్నది. . అక్కడే ఒక ప్రక్కగా మోకాళ్లమీద తల వాల్చుకుని కూర్చుని ఉన్నాడు. ఆయన పెద్దవాడు పైగా కబోది '' అన్నాడు

చంద్రమౌళి జాలిగా ''అయితే మీరు అక్కడ ఉండటం చాలా ముఖ్యం వెంటనే వెళ్లి దగ్గరే ఉండండి అన్నట్టు మీ అమ్మగారి వయసెంత ?'' అని అడిగాడు పార్థసారధి ''ముప్పయి అయిదో నలభయ్యో ఉంటాయి అయినా దాదాపు అయిదారేళ్ల నుంచీ ఉన్న దగ్గును నిర్లక్ష్యం చేసి యీ స్థితికి తీసుకువచ్చింది నా చదువు కోసం 'ఎలా డబ్బు సమకూర్చడమా' అన్న ప్రశ్న తప్ప నా తల్లిదండ్రులకు యిన్ని ఏళ్లుగా మరొక ఆలోచనే లేదు. మా నాన్న తాలూకా ఆఫీసులో చీకటి గదిలో టైపు చేస్తూనే జీవితమంతా గడిపాడు రిటైరయ్యే వయస్సు వచ్చేసరికి చూపు మందగించి పోయింది ఇప్పుడు పరిస్థితు లిలా విషమించి పోయాయి'' అన్నాడు

చంద్రమౌళి ''మీకే సహాయం కావలసి వచ్చినా సంకోచం అక్కర్లేదు ఇక్కడికి రండి. నాకు చేతనైన దంతా చేయగలను'' అన్నాడు. పార్థసారధి ఆర్ద్రమైన కళ్లతో, ''కృతజ్ఞుణ్ణి'' అని చెప్పి వెళ్లిపోయాడు ఆ నాటి సాయంకాలం పని పూర్తి అయిన తర్వాత చంద్రమౌళి కిటికీలో నుంచి క్రిందికి చూస్తే క్లబ్బు టెన్నిస్‌కోర్టు నిర్మానుష్యంగా బోసిపోయి కనిపించింది

* * * *

మర్నాడు సాయంకాలం ఆఫీసు మూసివేసే సమయంలో చంద్రమౌళి వాకిట్లో నిలబడి ఉండగా పార్థసారధి రిక్షా దిగివచ్చాడు అతడు మరీ దీనంగా ఉన్నాడు అతడు రిక్షావాడికి డబ్బులిస్తూ ఉండగా చంద్రమౌళి ''ఏమండీ ! ఎలా ఉన్నది మీ అమ్మగారికి ?'' అని అడిగాడు పార్థసారధి కళ్లు చెమ్మగిలుతూ ఉండగా ''ఏం చెప్పను ? ఈ రాత్రి గడవటం కష్టమే - నంటున్నాడు డాక్టరు ఆమె అప్పుడప్పుడు మాత్రం కళ్లు తెరచి చూస్తున్నది ఏవో కొత్త ఇంజెక్షనులు కావాలని వ్రాసి యిచ్చాడు డాక్టరు. మిమ్ములను అడుగుదామని వచ్చాను''అన్నాడు చంద్రమౌళి వెనుదిరుగుతూ ''అలా అయితే లోపలికి రండి డబ్బు యిస్తాను తర్వాత నా కారులో ఎక్కితే మిమ్ములను దోవలో ఆసుపత్రి దగ్గర దింపి నేను వెళ్లిపోతాను'' అంటూ లోపలికి నడిచాడు పార్థసారధి ఆయన వెంటనే వెళ్లాడు

చంద్రమౌళి మూరు రూపాయల నోటు ఒకదాన్ని అతని చేతికిచ్చి ''ఇది సరిపోతుందా ?'' అని అడిగాడు. పార్థసారధి తలవూపి, ఆ నోటు అందుకున్నాడు ఇద్దరూ బయలుదేరి హాస్పిటల్ ముందుకు వచ్చేసరికి కారు ఆపి చంద్రమౌళి ''మీరు దిగండి'' అన్నాడు అంతవరకూ దీనంగా మరో ప్రపంచంలో ఉన్నట్టున్న పార్థసారధి వెంటనే క్రిందికి దిగి ''నాకేమిటో భయంగా ఉన్నదండీ దయచేసి మీరు కూడా రారాదూ ?'' అన్నాడు

చంద్రమౌళి '''వస్తాను కాని మీరలా అధైర్య పడకూడదు. ఇటువంటి సమయాల్లో ధైర్యం చాలా అవసరం మరీ అంత నీళ్లకారి పోకూడదు'' అంటూ దిగి అతని వెంటనే లోపలికి వెళ్లాడు.

అది పెద్ద ఆసుపత్రి ముందు పెద్ద వరండాలో వరుసలుగా మంచాలు ఉన్నాయి అక్కడొక్కటీ అక్కడొక్కటీ పడకలు ఖాళీగా ఉన్నప్పటికీ మిగిలిన అన్ని మంచాలలోనూ రోగులు పడుకుని కొందరూ, కూర్చుని కొందరూ ఉన్నారు డ్యూటీలో ఉన్న నర్సు ఎవరి అవసరాలు ఏమిటో కనుక్కుంటూ అటూ యిటూ తిరుగుతున్నది మిగిలినవి ప్రత్యేకమైన గదులు వాటిలో రెండేసి మంచాలు ఉన్నాయి. ఒక గదిలో పెద్ద గొడవ జరుగుతున్నది ఒక రోగిచేత మందు త్రాగించడం కోసం యిద్దరు నర్సులూ డాక్టర్లూ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు అతడు మాత్రం అందరినీ తోసివేస్తూ "మీరు నాకు విషం పోస్తున్నారు నేను తాగను గాక తాగను" అని అరుస్తూ కేకలు పెడుతూ గందరగోళం చేస్తున్నాడు చంద్రమౌళీ, పార్థసారధి ఆ గదిముందు ఓ క్షణం ఆగారు పార్థసారధి నవ్వి "అతడొక లక్షాధికారి తనను ఎవరో ఒకరు విషంపెట్టి చంపేసి తన ఆస్తిని కాజేస్తారని ఎప్పుడూ భయపడుతూ ఉండేవాడు ఇంట్లో అందరిమీదా, చివరకు కట్టుకున్న పెళ్లాంమీద కూడా అనుమానమే ఇప్పుడేమో జబ్బుచేసింది ఇక్కడికి వచ్చినప్పటినుంచీ యింతే నానా హంగామా చేస్తున్నాడు" అని చెప్పాడు. చంద్రమౌళికి నవ్వు వచ్చింది ఆయనకీ ఆసుపత్రి వాతావరణమే కొత్తగా ఉంది తనజీవితంలో ఎన్నడూ ఆయన యింతవరకూ ఆసుపత్రి ఎరుగడు ఎప్పుడైనా అడపా దడపా చిన్నచిన్న జ్వరాలూ, జలుబులూ వస్తే శ్రీదేవి తన పరిచర్యతో, చిన్న చిన్న గృహవైద్యాలతో తనను సేదదీర్చేది వారిద్దరూ అలా నడుస్తూ చివరి గదుల దగ్గరికి వచ్చారు ఒక గది ముందు ఆగి పార్థసారధి "రండి లోపలికి" అంటూ తాను ముందు నడిచాడు చంద్రమౌళి గుమ్మం దాటి లోపలికి వెళ్లి చుట్టూ చూశాడు

ఆ గదిలో ఒకే మంచం ఉంది మంచానికి దిగువగా చాపమీద ఒక ముసలి, పడుకుని నిద్రపోతున్నాడు అతని గడ్డం పండి వుంది గదిలో నేల అంతా తెల్లని నాపరాతితో శుభ్రంగా వుంది

పార్థసారధి రోగి మంచానికి ప్రక్కగా ఉన్న కుర్చీని యివతలికి లాగి చంద్రమౌళి నుద్దేశించి "కూర్చోండి" అన్నాడు చంద్రమౌళి కూర్చుని రోగి వైపు చూశాడు

ఏళ్ల తరబడి దగ్గుతో, ఆయాసంతో, కృశించిపోయిన బలహీనమైన శరీర మామెది చాలా నెమ్మదిగా, బరువుగా గాలి పీలుస్తున్నది ఆరిపోతున్న దీపశిఖవలె చావూ బ్రతుకుల మధ్య ఊగులాడుతున్నది

చంద్రమౌళి ఒక్క నిముషం ఆగి తర్వాత లేచి నుంచుని "మీరు ధైర్యంగా ఉండండి మన మంతకన్నా చేయగలిగింది ఏమీ లేదు మనం అలవరచుకోవలసినదల్లా ధైర్యంగా నిలబడటమే" అన్నాడు పార్థసారధి దుఃఖిస్తూ "ఏం ధైర్యమో! ఎంతగా ప్రయత్నించినా యీ బాధ తన్నుకుని పైకి వస్తున్నది ఉన్న ఆ ఒక్క దిక్కూపోతే యీ కబోది తండ్రీ, నేనూ ఎన్ని అగచాట్లపాలు కావలసి వస్తుందో!" అన్నాడు ఇంతలో చాపమీద పడుకునివున్న వృద్ధుడు లేచి మాటలు వినవస్తున్న వైపు మొహం తిప్పి దీనంగా కూర్చున్నాడు చంద్రమౌళి యివతలకు వస్తూ మళ్లీ తల తిప్పి రోగివైపు ఒకసారి చూశాడు ఆమె యిప్పుడు కళ్లు తెరుచుకుని మగతగా పడుకుని ఉన్నది

చంద్రమౌళి నడవటం ప్రారంభించాడు పార్థసారధి వెనకనుంచి 'నేను ఉండిపోతానండీ' అనటం వినిపించింది బయట చీకట్లు అలుముకుంటున్నాయి వరండాలో అక్కడొక మనిషి అక్కడొక మనిషి తప్ప సందడేమీ లేదు. చంద్రమౌళి బూట్ల చప్పుడు కూడా వినపడనంత నెమ్మదిగా నడుస్తున్నాడు ఆమె ముఖమే ఆయనకు చిరపరిచితమైనదిగా మాటిమాటికీ జ్ఞప్తికి వస్తున్నది ఒక అద్భుత శిల్పం చెయ్యి విరిగీ, కాలు విరిగీ వికృతమైపోయినట్టూ పసి పిల్లవాడు ఎంతో అపేక్షగా చూసుకుంటున్న ఆటబొమ్మ పగిలి ముక్కలై పోయినట్టూ, చిత్రాకారుడు తాను జీవితమంతా శ్రమచేసి, తన నైపుణ్యం అంతా ధారపోసి చిత్రించిన రమణీయ చిత్రం మీద ఒక మూర్ఖుడు రంగులు పులిమినట్టూ ఉన్నది గాజు కొంపలో ఉండి బయటి ప్రపంచాన్నీ మనుష్యులనూ చూసేవాడికి అన్నీ చాలా అస్పష్టంగా కనిపించినట్టు ఏదో అస్పష్టరూపం ఆయన మనస్సులో తెలిసీ తెలియకుండా యిబ్బంది పెడుతున్నది

చంద్రమౌళి కారు దిగి యింట్లో ప్రవేశించగానే శ్రీదేవి ఎదురుగా వచ్చి "ఏమిటండీ అలా ఉన్నారు?" అని అడిగింది ఆమె తన భర్త ఎన్నడూ పరధ్యానంగా ఉండటం చూసి ఎరుగదు ఆయన "ఏమీ లేదు" అని చెప్పి దుస్తులు మార్చుకుని పైన వాలు కుర్చీలో కూర్చుని ఉండగా ఆమె కాఫీ తీసుకువచ్చి అందించింది

చంద్రమౌళి కాఫీ త్రాగుతూ పక్క డాబా మీదికి చూశాడు. అప్పుడే ఉదయిస్తున్నది చంద్రబింబం. ఆ యిద్దరు పిల్లలూ రోజూ వలెనే మళ్లీ పరుగులెత్తుతూ ఆడుకుంటున్నారు ఆ ఆడపిల్ల ఒక్కసారి ఆగి "అదుగో! ఆ మబ్బు చూడు రఘూ! చెట్టులాగా లేదూ?" అన్నది

చంద్రమౌళి ఏదో స్ఫురించగా, చేతిలో ఉన్న కాఫీ కప్పు క్రింద ఉంచేసి వ్యాకులహృదయంతో "శ్రీదేవీ! ఆ తలుపు మూసి నువ్వు క్రిందికి వెళ్లిపో నన్ను కాసేపు ఒంటరిగా ఉండనివ్వు" అన్నాడు

ఆమె నివ్వెరపోతూ కాఫీ కప్పు చేతిలోకి తీసుకుని, తలుపు వేసి, నెమ్మదిగా క్రిందికి వెళ్లిపోయింది. ఆయన కళ్లు మూసుకుని వాలు కుర్చీలో విశ్రాంతిగా పడుకుని ఏమీ ఆలోచించకుండా ఉండేందుకు ప్రయత్నం చేశాడు

* * * *

మరునాడు ఉదయం శ్రీదేవి, భర్త ముఖం చూసి ఆశ్చర్యంతో "అలాఉన్నా రేమిటి?" రాత్రి నిద్ర సరిగా పట్టలేదా?" అని అడిగింది ఆయన నవ్వి "ఎలా ఉన్నానూ? రాత్రి వళ్లు మరచి నిద్రపోయానే" అన్నాడు కాని అది అబద్ధం శ్రీదేవి ఆయన మాటలను నమ్మనూ లేదు ఆయన రాత్రిఅంతా జాగ్రదవస్థకూ సుషుప్త్యవస్థకూ మధ్య బాధ పడ్డాడు కన్నుమూస్తే ఏవో అర్థంలేని పిచ్చి పిచ్చి కలలు వచ్చి నిద్రను ఎన్నడూ లేనంతగా పాడుచేశాయి శ్రీదేవి "ఏమో! రాత్రి మీరు రోజూలాగా ఆదమరచి నిద్రపోలేదు ఒకసారి కెవ్వున కేకవేసి లేచారు కూడా. నాకెంతో భయం వేసింది అప్పుడు గడియారం చూస్తే సరిగ్గా రెండు గంటలైంది రాత్రి అంతా భయంతోనే గడిపాను" అన్నది

తర్వాత ఆయన ఆఫీసుకు వెళ్లగానే రాఘవులు ఒక కాయితం తెచ్చి అందించాడు అందుకుని చూస్తే అది పార్థసారధి సెలవు దరఖాస్తు. తన భల్లి రాత్రి రెండు గంటల వేళ మరణించిందనీ, తనకు ఒక పది రోజుల సెలవు అత్యవసరమనీ వ్రాశాడతడు

చంద్రమౌళి ఆ పూట అంతా ఒక్క కాయితమైనా చూడకుండా ఆఫీసులో వాలు కుర్చీలో పడుకుని నిద్రపోయాడు, రాఘవులతో, 'ఎవ్వరినీ లోపలికి రానివ్వవద్ద'ని చెప్పాడు

ఆయనకు మెలకువ వచ్చేసరికి గాజు తలుపుమీద దీపపు వెలుగు పడుతున్నది అవతల ఎవరున్నారో స్పష్టంగా తెలియడంలేదు కాలింగ్‌బెల్ నొక్కగానే రాఘవులు త్వరత్వరగా వచ్చి "కారు వచ్చింది బాబుగారూ!" అన్నాడు. చంద్రమౌళి లేచి ఒళ్లు విరుచుకుని "త్వరగా తాళంచెవులు తెచ్చి యివ్వు" అంటూ బయటికి వెళ్లాడు

రెండు నిముషాలతర్వాత వేగంగా పోతున్న కారులో కూర్చుని ఆయన "కలలలో ఎవరెవరినో చూస్తూ ఉంటాము అలాగే యిదీనూ... ఎప్పుడెవరిని కలుసుకుంటామో . ఎప్పుడు విడిపోతామో తెలియదు" అనుకున్నాడు తర్వాత కారులో ఉన్నంతసేపూ ఆయన ఆలోచనలన్నీ శ్రీదేవి మీదనే ఉన్నాయి. "రాత్రి ఎంతో బాధపడి ఉంటుంది నా పిచ్చి శ్రీదేవి" అనుకున్నా డాయన తర్వాత పెద్దగా "రాజూ! మరి కాస్త త్వరగా పోనివ్వవోయ్" అన్నాడు రాజు "అలాగేనండీ" అంటూ కారు వేగం హెచ్చించాడు.